# ఇల్లు

"నవో నవో భవతి జాయమానః..."

"ఆశీర్వచనపు పనస. అమ్మయ్య!" అనుకున్నాడు. సుబ్బారాయుడు రిక్షాదిగుతూ.

అక్షంతలు జల్లి యివతలకు వస్తున్న ఒక ముసలాయన పల్కరించేడు–

"ఇప్పుడా రావడం."

"బండి గంట లేటు".

ఎరిగున్న వాళ్ళు యింకో యిద్దరు పల్కరించేరు. సుబ్బారాయుణ్ణి ఎరగని వాళ్ళకి పరిచయం చేసేడు ముసలాయన–

"పావన రామయ్య బావమరిది, ఎరుగుదువు కదూ – నీలవేణమ్మకి సయానా తమ్ముడు."

సుబ్బారాయుడు సన్నగా పొడుగ్గా తుదవంగిన చెఱకుగడలా ఉంటాడు. ముతక గుడ్డలు. ముతక మొహం.

సుబ్బారాయుడికి ఎవరో నీళ్ళిచ్చేరు. ఇంకెవరో చేతికి తువ్వాలిచ్చేరు.

"రిక్షావాడికి కూలెంత బావా?" అని పావన రామయ్య పినతల్లి కొడుకడిగేడు.

"అర్ధరూపాయ్" అని, "నేనిస్తాను" అన్నాడు.

చేతులు తుడుచుకుంటూ సుబ్బారాయుడు లోనికి వెళ్ళేసరికి పావనరామయ్య అప్పుడే పీటల మీంచి లేచి సభకు నమస్కరిస్తున్నాడు. పురోహితుడు తనకొచ్చిన వాటిని నొల్లుకుంటూ "సభాయై నమః" అన్నాడు గొణుగుడుగా.

పావనరామయ్య ఒక ఛాయ నల్లగా కొంచెం పల్చగా ఉంటాడు. ఎర్రని పట్టు తాపితా కట్టుకున్నాడు. అది రంగు బాగా వెలిసి తూట్లుపడి ఉంది. అతడి జుత్తు చాలా వరకూ తెల్లపడింది. అరవయ్యోపడి సమీపించినా అంతకన్నా చిన్నవాడిలా ఉంటాడు.

నీలవేణమ్మ పొట్టిగా స్థూలమనిపిస్తుంది. బావమరిదిని చూసి పావనరామయ్య "సుందరం స్టేషన్లో కనపడలేదూ?" అన్నాడు.

అది అతడు పలకరించే పద్ధతి.

"రిక్షావాడికి గుర్తులుచెప్పి ఏదో సామాను కొనాలని దిగబడ్డాడు" అప్పగారికేసి చూస్తూ జవాబిచ్చేడు.

"వంట బ్రాహ్మడు గోధుంనూక చాలదంటే తెమ్మన్నాను" నీలవేణమ్మ మాటలో మాటకలిపి వెళ్ళిపోయింది.

సుబ్బారాయుణ్ణి లోపలికెళ్ళమని చెప్పి పావనరామయ్య వీధిలోకి వెళ్ళేడు.

దిగంతాల మంచుతెరలింకా విడుతూనే ఉన్నాయి. సూర్యోదయమై నిండా ఘడియ పొద్దవుతుంది. ఎదుట దక్షిణ దిశను నగరం ఏటవాలుగా పరచుకుని ఉంది.

"చక్కటి దృశ్యంరా అబ్బీ! ఆ ఎదురుగా వేసిన పునాదుల మీద యిల్లు లేచిపోతే ఏమీలేదు".

ముసలాయన పావనరామయ్యకు బాబయ్య అవుతాడు. స్కూల్ మాస్టరీ చేసి రిటైర్ అయ్యాడు. ఇప్పటికీ ప్రైవేట్లు చెపుతాడు.

"ఏమున్నది – ఇంకో ఆరునెల్లు పోయేక వస్తే యీ యిల్లు ఎక్కడని వెతుక్కోవలసిందే" పావనరామయ్య స్నేహితుడన్నాడు.

"రా! కూర్చో!" అన్నాడొకతను. మరొకాయన జరిగి చోటిచ్చాడు.

కూర్చుంటూ "ఇంకా ఎవరూ రాలేదు" అన్నాడు పావనరామయ్య. వాకిట్లో నిలబడి చుట్టలు కాలుస్తున్న వాళ్ళిద్దరూ పై ఊరి నుండి వచ్చిన బంధువులు.

"చలి! అందునా ఇవాళ విపరీతమైన మంచు. సముద్రపొద్దున చలి వెయ్యదంటారు!" వాళ్ళలో ఒకడన్నాడు.

ఇంటికి తూర్పున ఉన్న పెద్ద డాబా నీడ పెరటికేసి వ్యాపించి ఉండడం గమనిస్తున్నాడు పావనరామయ్య.

"బాబూ! ఇప్పటికి గృహప్రవేశం తంతయ్యింది. ఇంక సత్యనారాయణ వ్రతం, వెంకటేశ్వర దీపారాధన కావాలి. అరగంటలో వర్జం వస్తుంది" – పురోహితుడు.

పావనరామయ్య లేచి పెరట్లోకి వెళ్ళేడు. పెరట్లో కూడా చిన్న పందిరి వేసేరు. దానికి తూర్పువైపు గాడి పొయ్యి వుంది. నలుగురు ఆడవాళ్ళు ఎండలోచేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇద్దరు ఆడవాళ్ళు వంట బ్రాహ్మడికి చెక చెక కూరలు తరుగుతున్నారు. పిల్లలు కొందరు ఆకలి కేడుస్తున్నారు. ఒకావిడ తీరిగ్గా బిగించి బిగించి జడవేసుకొంటోంది.

పావనరామయ్య ఆడవాళ్ళను కదిలించడానికి చేసే ప్రయత్నం కలిసి రావడం లేదు, అప్పుడే స్నానం చేసి వస్తున్న సుబ్బారాయుడు "నువ్వు పద. నేను అన్నీ ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

**2**

పగలు పదకొండు గంటలవుతుంది. పావనరామయ్య యిల్లు కిటకిటలాడుతోంది.

శుభకార్యం జరుగుతున్న నట్టింట కొందరు ముసలివాళ్ళూ, ఆడవాళ్ళూ, పిల్లలూ ఇరికిరికి కూర్చున్నారు. వీధి వరండాలో స్నేహితులూ తన బంధువులూ కూర్చున్నారు.

చోటు చాలని వాళ్ళూ, ఎండ కావలసిన వాళ్ళూ రోడ్డుమీదా, వాకిటా నిల్చుని పొగలు పీలుస్తూ దిక్కులు చూస్తున్నారు. పడమటి గోడ నీడను పడుచుపిల్లలు కొందరు మంచాలేసుక్కూర్చుని కబుర్లు చెప్తూ గడబిడ చేస్తూ ఎగిరెగిరి పడుతున్నారు.

పాత జార్జెట్ చీరలూ, అంతకన్నా పాత పట్టుచీరలూ కట్టుకొన్న కొందరు ఆడవాళ్ళు పెరటి ఎండలోనుండి నీడలోకీ, నీడలోనుండి ఎండలోకీ తిరుగుతున్నారు. ఒకటి రెండు చీరలప్పుడప్పుడూ పడమటి గోడ చుట్టి వీధిలోకి వచ్చి వెనక్కి వెళ్ళిపోతున్నాయి.

గాడిమీద ఆవిర్లొస్తున్న అండాల్ని వంటబ్రాహ్మడు దింపుతున్నాడు. దిగిన వేడి వేడి అండాలను ఇంట్లోకి సాయం పడుతున్నారు.

ఆ యింటికి పడమటి వైపున కొత్తగా పడుతున్న పునాదుల వెనుక పూరిపాక గుమ్మంలో కూర్చున్న ఏడేళ్ళ పిల్లవాడికి ఆ యిల్లు చీమలుపట్టిన కలకండ ముక్కలా ఉన్నది. ఆ పునాదుల కెదురుగా ఉన్న మేడమీద ఓ పదహారేళ్ళ అమ్మాయి యిదంతా తీరిగ్గా చూస్తున్నది. ఆమెకి ఆ సీను వాళ్ళ ఆర్టిస్టు బావ రంగులు తుడుచుకునే తెల్లటి పాత షర్టు ముక్కలా ఉంది.

అంతవరకూ అందరికీ అన్నీ అందిస్తూ వచ్చిన సుందరం 'ఇంతమందికి భోజనాల ఏర్పాటు ఎక్కడ? ఎలా?' అన్న ప్రశ్న ఎదురుపడగా హడావుడిగా మేనమామను వెతుక్కుంటూ బయలుదేరేడు.

అతడు పెరట్లో గాడి పొయ్యి దగ్గర దొరకలేదు. వీధిలో జనం మధ్యన ఉన్నాడేమోనని వెళ్ళేడు.

"వీడే" అన్నాడు తాతగారు. సుందరం నిచ్చరబోయేడు.

"ఐదుగురు మగపిల్లలకూ దక్కినవాడు వీడొక్కడు. ముగ్గురాడపిల్లలకూ ఇందాక నాకు మంచినీళ్ళు తెచ్చిపెట్టిన పిల్ల సూర్యమణి ఉన్నది".

అందరి చూపులూ ఒక్కసారి సుందరం వంక తిరిగేయి. సుందరానికి ఇరవై యేళ్ళంటే ఎవ్వరూ నమ్మరు. ముఖంమీద ఉన్న పెద్ద పెద్ద గంట్లు చూస్తే వాడైనా పొరపాటున బతికిపోయేడనిపిస్తుంది. ఎటొచ్చీ వాడివి విశాలమైన కళ్ళు.

అంతమందీ ఒక్కసారి తనవంక అలా చూసేసరికి వాడు వచ్చిన పని మరిచి వెళ్ళిపోయేడు.

"పెద్దవాడు యిరవై యేళ్ళవాడు. ఫస్టుక్లాస్ డిగ్రీ పుచ్చుకున్నాడు. ఉద్యోగంలో చేరి నిండా నెల తిరగలేదు. ఆసుపత్రిలో చేర్చేరు. చేర్చిన పదిహేను రోజుల్నాడు హరీమనేశాడు. ఆ షాకునుండి తేరుకోకండానే రెండోదెబ్బ. పద్దెనిమిదేళ్ళు పెంచి పెద్దదాన్ని చేసేరు ఆడపిల్లను. వెయ్యి రూపాయలు కట్నం. పదిహేను వందలు యితర ఖర్చులు. కడుపుతో ఉంది. ఇవాళో రేపో కంటుంది. మనవడా మనవరాలా అని ఎదురు చూస్తున్నారు. ఆ పిల్ల అసలుకే మోసం చేసిపోయింది".

విన్నవాళ్ళు వింటున్నారు. వినని వాళ్ళు కొందరు ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. అందరూ తంతు ఎప్పుడు ముగుస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

చివరకు ముగిసింది. పీటలమీంచి లేచిన వాళ్ళతో పాటు తక్కినవాళ్ళు కూడా లేచేరు.

కొంతమంది యింటిలో నుండి బయటకు వెళ్తున్నారు. మరికొంత మంది బయట నుండి లోనికి వెళ్తున్నారు.

ఇల్లు చిన్నదన్నాడు ఒకాయన. చిన్న వీధికొట్టు. అంతకన్నా కొంచెం పెద్దది వరండా. మధ్యను ఒకటే పెద్ద గది. గదినానుకుని పెరటి వరండా వంట గది, ఆ వెనక తగుమాత్రం పెరడు. ఈశాన్య మూలని నుయ్యి వాయువ్య మూలని లెట్రిన్ ఉన్నాయి.

ఇల్లు బొమ్మరిల్లులా ఉన్నదన్నాడు ఒకాయన.

ఇల్లు బాగుందన్నాడు యింకొకాయన.

"నుయ్యి మనదేనా?" అనడిగేడెవడో.

"ఉమ్మడి" అన్నాడు పక్కాయన.

"ఎవరితో"

"ఈ యిల్లు అమ్మిన వాళ్ళతోనే"

నట్టింట నిలుచుని దానికి సరిపడా ఉన్న ఓ పట్టు చీరావిడ అడుగుతోంది–

"కోడలొస్తే కొడుకూ కోడలూ ఎక్కడుంటారు?"

"పండుక్కి కూతురొస్తే కోడలు పుట్టింటి కెళ్తుంది. ఫరవాలేదు" అనుకుంది ఒక పిల్లల తల్లి.

వీధిలో రోడ్డుమీద నిల్చుని వళ్ళు విరుచుకుంటున్న ఆవలింతల రాయుడు అంతా అయ్యాక అన్నాడు–

"అన్నీ సరిపెట్టుకోవచ్చుగాని ఒక్కటే యిబ్బంది".

పక్కవాడు ఏమని ప్రశ్నించలేదు.

"చుట్టూ అన్నీ ఎత్తున ఉన్న యిళ్ళు. ఆడవాళ్ళు ఏ చిన్నగుడ్డో కట్టుకుని పెరట్లోనైన తిరగడానికి వీలుండదు".

దీర్ఘ దర్శి దీర్ఘ దృష్టులను గమనించి విస్తుపోయేడు రెండోవాడు.

వెళ్ళిన వాళ్ళు వెళ్ళగా ఉన్నవాళ్ళు భోజనాలకి లేచేసరికి పన్నెండు దాటింది.

సుబ్బారాయుడు వీధి వరండాకు దుప్పట్లు కట్టి దానిని

కూడా ఉపయోగంలోకి తెచ్చేడు. మొదటి పంక్తిలో మగవాళ్ళూ, పిల్లలూ లేచేరు. రెండవ బంతిలో ఆడవాళ్ళు కూర్చున్నారు.

"పిల్ల చామనచాయైనా పెద్ద కళ్ళు, కళైన ముఖం, పరిశుభ్రతా మాట మృదువు – అన్నీ ఉన్నాయి. మరి దీని ఖర్మం ఎలా ఉన్నదో" అన్నదొకావిడ.

సూర్యమణి సన్నగా సళాకులా దట్టమైన పొడవాటి తలకట్టుతో నీటుగా వాణీ చెంగు మొలను ముడిచి వడ్డిస్తోంది. – వరసలుపెట్టి.

"పిల్లకు పదహారేళ్ళుండవూ?" అన్నదొకావిడ.

"ఉండకేం మొన్న పెళ్ళైన మా చిట్టీ ఇదీ ఒక్క తోటివాళ్ళే".

–ఎదుటి పంక్తి నుండి జవాబు వచ్చింది.

''ఉండనిన్రా! ఇప్పుడేం తొందరొచ్చింది?'' మందలించింది ఇంకొకావిడ.

పిల్లల్ని పెట్టుక భోజనాలు కానిస్తున్న ఆ ఆడవాళ్ళలో సూర్యమణి వంక జాలిగా చూసేవారు జాలిగా చూస్తే, ఆశగా చూసేవారు కొందరు ఆశగా చూసేరు. ఒకళ్ళిద్దరి కళ్ళకి ఆ పిల్ల అతిగా తిప్పుకుంటున్నట్టు కాస్త విరగబడుతున్నట్టూ కనిపించింది.

భోజనాలయ్యాక యింటికి తూర్పుకేసి చేరిన నీడలో రెండు మంచాలూ, మూడు కుర్చీలూ పడేసుకుని ఐదుగురు మగాళ్ళు ఆయాసం తీర్చుకుంటున్నారు.

వాళ్ళలో ఇద్దరు నడికారు వారు మంచాలెక్కారు. ఒకాయన వెల్లకిలా పరుండి నీలాల నింగికేసి చూస్తున్నాడు. అతడు కలెక్టరాఫీసులో ఏదో సెక్షన్‌లో ఏదో గుమస్తాగా పనిచేస్తున్నాడు. రెండవ ఆయన ఒక తలగడా కూడా సంపాదించి పట్టిమంచం మీద బోరిగిలా పడుకొని ఎదురుగా కనిపిస్తున్న గడ్డిమొక్కల్లోకి చూపులు వదిలి మనసును ఇంకేవో లోకాల్లో పారాడనిస్తున్నాడు. అతడు జిల్లా కోర్టులో బాగా ప్రాక్టీస్ ఉన్న లాయరు వద్ద చాలాకాలంగా పనిచేస్తున్న ప్లీడరు గుమస్తా.

మడత కుర్చీలో కూర్చున్న మనిషికి ముప్పై ఐదేళ్ళుంటాయి. ఒక్కడంటే ఒక్కడే కొడుకు. ఒక్కతే కూతురు. లోకల్ ఎన్‌జీవోల అసోసియేషన్‌కి శక్రటరీ. కాస్తంత కవి. కొంచెం నటకుడు. చాలా భావుకుడు. కళ్ళనున్న అద్దాలలో నుండి ఆ చుట్టూ వున్న మేడల్ని చూస్తూ వాటి గురించి భావిస్తున్నాడు.

ఎపిటియస్ ఆఫీసు క్లర్కుకి ముప్పై ఏళ్ళుంటాయి. పేంటు మడతలు నలగకుండా పొందిగ్గా పేము కుర్చీలో కూర్చున్నాడు. దర్జాగా కాళ్ళూపడం అలవాటు. ఇప్పుడా ఊపడం అప్రయత్నంగా సాగుతూ ఉన్నది.

చేతుల్లేని కర్రకుర్చీలో యిబ్బందిగా కూర్చున్న అబ్బాయి యీ మధ్యనే యూనివర్శిటీ చదువు ముగించి ఉద్యోగం కూడా చేస్తున్నాడని వినికిడి.

నీలాల నింగికేసి చూస్తున్న పెద్ద గుమస్తాచూసి చూసి అన్నాడు.

"పశువులకూ, పక్షులకూ కూడా తమ స్వంత గూడంటూ ఉంటుంది. మనిషి చచ్చిందాకా బ్రతికి కూడా తమ స్వంత గూడంటూ కట్టుకోలేక పోతున్నాడు. దీనికి ఎవరిని ఏమనాలో తెలియడం లేదు" అన్నాడు.

ఎవరూ ఏమీ జవాబివ్వలేదు.

"బ్రతుకు బ్రతుకల్లా శ్రమపడి కూడబెట్టిందంతా ధారపోస్తే కాని ఒక గూడు రాకపోవడం చాలా అన్యాయం" అన్నాడు ఆయనే. ఈసారి జవాబొచ్చింది.

"ఎంతయ్యిందేమిటి?" అన్నాడు ఫ్రేము కుర్చీలో ఆయన కాళ్ళూపడం ఆపకండానే.

"ఆరు వేలు!"

ఈసారి కాళ్ళూగడం ఆగిపోయింది–

"ఆరు వేలే!!"

ఆ రేటున తాను కట్టదలచిన ఇంటికి ఎంతలేదన్న పదిహేను వేలదాకా అయ్యేటట్టుంది. అతడి కాళ్ళు మళ్ళా ఊగడం ప్రారంభించేయి.

"అదైనా యీ వాడలో కాబట్టి" అని "ఈ పెన్షన్ ఉద్యోగాలకన్నా పియఫ్ ఉద్యోగాలే నయమేమో" అన్నాడు మొదటాయన.

"వాళ్ళనడిగితే ఇంకోలా అంటారు" మడత కుర్చీలో వాడు మొదటిసారి మాటాడేడు.

"చూస్తే మనలాటి వాళ్ళ బతుకు కొసవరకూ అద్దె కొంపల్లోనే గడిచేటట్టు ఉన్నది" పేము కుర్చీ.

"మన బతుక్కి ఆ అద్దెకొంపలైనా ఉన్నయి. అదీ లేని వాళ్ళ సంగతో?"

"ఆకాడికి మనకన్నా పల్లెటూళ్ళ వాళ్ళే నయం. తినటానికి తిండి మాట ఎలా ఉన్నా ప్రతివారికి ఉండటానికో యిల్లు ఉంటుంది".

"పూరిపాకలు మనమూ వేసుకోవచ్చు. ఉండడానికి నామోషీ గాని" కర్రకుర్చీలో యూనివర్శిటీ అబ్బాయి కూడా మాటకలిపేడు.

"వేసుక చూస్తే తెలుస్తుంది. మర్నాటికే మునిసిపాలిటీ

వారు సిద్ధం".

"ఊర్లో ఉన్న పాకలన్నీ ఏమిటి?"

"వెళ్ళి అడగండి. వాళ్ళు ఎందరి నోళ్ళు ఎలా మూసుకు వస్తారో తెలుస్తుంది".

''ఏం? పాకలేనుకుంటే మునిసిపాలిటీ వారికి అభ్యంతరమేమిటి?" ఫేము కుర్చీ ఆయన అడిగేడు.

"మీ పాక అంటుకుంటే మా మేడ కాలిపోతుంది."

"అది చాలా అన్యాయం."

"మీరు స్వయంగా మేడ కట్టిన్నాడనండి."

"మీరు మేడకట్టరాదని నేనంటే."

"అనడం అందరం అంటాం. ఆక్టులు కొందరే చేస్తారు."

యూనివర్శిటీ అబ్బాయి కొంతసేపు ఊరుకొని అడిగేడు.

"నాకు తెలియకడుగుతాను. మనుష్యులు మేడకట్టడం పురోగమనం అంటారా లేక పాకలు కట్టడమే పురోగమనమా?"

"పది మంది మేడ దిగుతుంటే దిగుతున్నారంటాం. పదిమంది ఎక్కుతుంటే ఎక్కుతున్నారంటాం. నలభై మంది దిగి నలుగురెక్కుతున్నా ఎక్కుతున్నారనం. నలుగురు దిగి నలభైమంది ఎక్కుతున్నప్పుడే ఎక్కుతున్నారంటాం."

యూనివర్శిటీ అబ్బాయి ఓటమి నంగీకరించలేదు. నవ్వుతూ అన్నాడు.

"ఉపమానాలతో సాగే తర్కం ఎంతపనైనా చేస్తుంది. దానితో నందిని పందినీ చెయ్యవచ్చు. పందిని నందినీ చెయ్యవచ్చు."

"అవును. నిర్గుణుడని తెలుసుకున్నాక కూడా కొందరు తమ అవసరం కొద్దీ దేవుణ్ణి సగుణుణ్ణి గానే వుంచితే మరికొందరు ఆ పందినే దేవుడనుకొని మొక్కండని కూడా అంటూ ఉంటారు".

వాదం వివాదమౌతుందేమోనని పేముకుర్చీ ఆయన భయపడ్డాడు. కాని కాలేదు.

మడత కుర్చీ ఆయన మరికొంత సేపయాక అన్నాడు.

"జీవితావసరాలన్నింటికీ రేషనింగులు పెట్టని ప్రభుత్వాలు బియ్యం, పంచదార వంటి వాటికి మాత్రమే ఏల పెడతారో తెలుసా?"

"జనం చచ్చిపోతారు కాబట్టి" పేముకుర్చీ.

"కావలసిన వాళ్ళు యెంత దాచుకున్నా పట్టుబడరు కాబట్టి" ప్లీడరు గుమస్తా.

"ప్రభుత్వాలు కూలుతాయని" యూనివర్శిటీ అబ్బాయి నవ్వుతూ అన్నాడు.

"కాదు. జనంలో చాలామందికి ఊరకుక్కల్లా బతకటానికి అభ్యంతరం లేదు కాబట్టి".

ఆ తరవాత అతడేమన్నా యింకెవరూ అతడి నోట నోరు పెట్టలేదు.

---

ఆనాడు ఎందరెన్ని చెప్పినా నీలవేణమ్మ భోజనానికి లేవలేదు.

పీటల మీంచి లేస్తూనే వెళ్ళి పెరట్లో ఒక నులకమంచం పడేసుక పడుకుంది. ఎవరో వచ్చి ఏమని అడిగితే ఒంట్లో బాగులేదంది. ఆమెకు తనవంకా భర్తవంకా బంధువులు ఆడవాళ్ళు కొందరున్నారు. వాళ్ళు మేం చూసుకుంటాం పడుకో అన్నారు, తీరా ఆడవాళ్ళ పంక్తిని భోజనానికి లెమ్మంటే ఆమె ఏడుస్తున్నది.

శుభమా అని గృహ ప్రవేశమౌతూ ఏడవరాదన్నారు. శుక్రవారం పూటా నిండింట కంటతడి పెట్ట రాదన్నారు. పిల్ల బెగిలిపోతోంది చూసుకోమన్నారు. ఎవరెన్ని చెప్పినా ఆమె దుఃఖం ఆచుకోలేదు.

"ఆవిడ గారంతే. మీరు పదండి" అని గదిమింది ఆడపడుచు.

నీలవేణమ్మ ప్రవర్తన చూస్తే చాలా మందికి చాలా కారణాల వల్ల ఎంతో కొంత కోపం వస్తుంది. ఒక్క పావన రామయ్యకి మాత్రమే కోపం రాదు.

ఆమెతో రమారమి నలభై యేండ్లయి అతడు కాపరం చేస్తున్నాడు. మొదటి ఐదారేండ్లూ బాధ్యత గుర్తించలేని అజ్ఞానంలో వాళ్ళు ఏ కొంత హాయి అనుభవించారో అంతే. ఆ తరువాత ఉద్యోగం మీద చెంబులూ, గిన్నెలూ, పేకేజీ డొక్కులూ, ఇనప సామానులూ, కుక్కిమంచాలూ, పెట్టెబళ్ళల్లో, రైళ్ళల్లో, బస్సుల్లో వేసుకొని వాళ్ళెన్నెన్ని ఊళ్ళు తిరిగారో వాళ్ళకే తెలియాలి.

చీకటి కొట్టల్లో, పూరి యిళ్ళల్లో, పాడుపడ్డ కొంపల్లో, ఒంటి ఒంటి గదుల్లో మురికిలో, చీదరలో, అద్దెలకిచ్చిన యజమానులతో, అద్దెలకున్న పొరుగువాళ్ళతో, అద్దె వసూళ్ళకొచ్చే ఆసాములతో, వాళ్ళెన్నెన్ని పాట్లు పడ్డారో వాళ్ళకే తెలియాలి.

పురుళ్ళతో, పుణ్యాహవచనాలతో, శాంతులతో, చాలీ చాలని పాలకేడ్చే చంటి పిల్లల కింక ఏడ్పులతో, పాలడబ్బాలతో, జబ్బు గేదెల నీళ్ళ పాలతో, కంట్రోళ్ళతో, బ్లాక్ మార్కెట్‌లతో, ఉప్పుడు బియ్యాల స్టేండర్డు గుడ్డల రేషనింగులతో, మందులతో, పిల్లల కడుపుల బల్లలతో,

వాంతులతో భేదులతో, అమ్మవార్లతో, ఆటలమ్మలతో, ఆ అంటువ్యాధులతోనే ప్రయాణాలతో, వారాల కొద్దీ జాగరణలతో, నెలాఖరులో చావులతో వాళ్ళెన్ని కష్టాలు పడ్డారో వాళ్ళకే తెలియాలి.

చుట్టాలు, చుట్టాల చుట్టాలు, చుట్టాల పెళ్ళిళ్ళు, వడుగులు, తమ యింటి వియ్యాలవారు, తమ పిల్లల చదువులు, వాళ్ళ వడుగులు, వాళ్ళ పెళ్ళిళ్ళు ఇన్నింటినీ తట్టుకున్నారు. తట్టుకున్నారంటే, కడుపునీ, కంటినీ, కాలునీ, అన్నింటినీ కట్టుకొని తట్టుకొన్నారు.

కాని వాళ్ళు తట్టుకోలేనిది ఒక్కటే, కడుపుశోకం.

కడుపు శోకమేమీ కొత్తది కాదు. లోకంలో ఎందరో అనుభవించేరు. అది కడుపు శోకమని తమ్ము తాము నమ్మించుకుంటే వారు కూడా దానిని తట్టుకునే వారు.

కడుపు శోకం మొదటిసారిగా రుచి చూసిన నాలుగేళ్ళ అమ్మాయిని తాను బాది బాది చంపేశానని అంటుంది నీలవేణి. మూడవ ఏట కడుపులో బల్లతో పోయిన ఐదవ అబ్బాయి సరియైన మందులు సకాలంలో పడక చచ్చిపోయాడని ఆమె నమ్మకం. ఆఖరు పురిటికి తాను పిల్లను కనలేకపోతే ఆపరేషను చేసిన ఆసుపత్రి వాళ్ళు చాతకాక ఆ పిల్లవాణ్ణి చంపేశారంటుంది. టైఫాయిడ్ పడి సంధిలో పద్యాలు చదువుతూ పోయిన అబ్బాయిని మేష్టర్లు చంపేశారంటుంది.

అందర్లోకి పెద్దబ్బాయిని తానెన్నడూ కొట్టకపోయినా పరీక్షలు! పరీక్షలు!! ఫస్టుక్లాస్! ఫస్టుక్లాస్!! అని హైరానా పెట్టి రాత్రింబవళ్ళు కంటికి నిద్రా, కడుపునిండా తిండీ లేకుండా చేసిన భర్తే పున్నెం కట్టుకున్నారంటుంది. చిట్టచివర పొట్టలో చిచ్చు పెట్టిపోయిన మహాలక్ష్మిని కట్టుకున్న మగడూ, పట్టుకెళ్ళిన అత్తగారూ పొట్టను పెట్టుకున్నారంటుంది.

పావనరామయ్య తక్కిన చావుల సంగతెలా ఉన్నా పెద్దబ్బాయి చావుకి కారణం తాను కాదని నిబ్బరంగా చెప్పుకోలేడు. అంచేత తక్కిన ఆరోపణలను కూడా కాదనే అవకాశం అతనికి లేకపోయింది. అందుచేతే నీలవేణమ్మ ఏడుపు ఆరంభిస్తే ఆమె ఊరుకునేదాకా తాను కూడా నోరు మూసుకు ఊరుకుంటాడు.

దీపాలవేళదాకా నీలవేణమ్మ శోకం ఆపి ఇంట్లోకి రాలేదు.

**3**

రైలుకి బయలుదేరిన సుబ్బారాయుణ్ణి అంపకం పెట్టడానికి పావనరామయ్య కూడా బయలుదేరాడు.

కుప్పల నూర్పులకు ఆ తెల్లవారుజామున ముహూర్తం. అందుచేత త్రయోదశి నాడు పెళ్ళాం పిల్లల్ని పంపించే షరతుపై అతడొక్కడే బయలుదేరేడు.

దశమి వెన్నెల. తొలిజాము. మంచు పలచగా కురుస్తోంది. వాళ్ళు సిటీ బస్సు కోసం జంక్షనుకేసి నడుస్తున్నారు.

"మొత్తానికి యిల్లే కొన్నావ్" అన్నాడు సుబ్బారాయుడు.

"ఆఁ. అప్పు కూడా చేసి."

ఆ యిల్లు కొనటం గురించి మూడు నెలల క్రితం కొంత రభస అయ్యింది.

ముప్ఫై ఐదేళ్ళు టైపిస్టు కాపీస్టుగా పనిచేసిన పావన రామయ్యకు రిటైర్ అయ్యేనాటికి ప్రావిడెంట్ ఫండ్ మూడువేల పైచిలుకు అందింది. ఎవడో యిన్సూరెన్సు ఏజెంట్ బలవంతాన తీయించిన పాలసీ బాపతు వేయి రూపాయలు వచ్చేయి. అందులో రెండు వేలు కట్నం లాంఛనాలకు పెట్టి ఒక వెయ్యి ఖర్చులతో పిల్లకు పెళ్ళి చేసేయమంది భార్య. ఇంకో వెయ్యి రూపాయలు చేత ఉంటే ఒక కాలునొచ్చినా చేయి నొచ్చినా పనికి వస్తాయని ఆవిడ ఉద్దేశ్యం. పి.యు.సి. రెండుసార్లు పోయి యిక చదవను నాన్నా అన్న కొడుక్కి ఆ మునసబు కోర్టులోనే గుమస్తా ఉద్యోగమయ్యింది. వాడి జీతంతోనూ చెయ్యగలిగినంత కాలం భర్తచేసే జాబ్ వర్కులతోనూ సంసారం వెళ్ళబుచ్చువచ్చని ఆవిడ భావం.

ఎంతమంది ఎన్ని చెప్పినా యిల్లే కొంటానన్నాడు పావనరామయ్య. అదీ మంచిదే. కట్నాల బజారులో కొడుక్కి ధర పెరుగుతుందన్నారు కొందరు.

పై వాళ్ళేమన్నా పావనరామయ్య మనసులో మాటేమిటో తనకు తెలుసనుకుంటాడు సుబ్బారాయుడు. కాని అప్పు అనేసరికి అతడు సహజంగానే భయపడ్డాడు.

"మళ్ళీ అదొకటా!" అన్నాడు దాన్ని బయట పెడుతూ.

"మనకు కావలసిన లొకాలిటీలో మనకు కావలసిన పాటి యిల్లు మన దగ్గరున్న దానిలో రాలేదు మరి".

సుబ్బారాయుడు ఆలోచించి ఒక నిట్టూర్పు విడిచేడు.

"కాని, ఎలా తీరుతుంది?"

"అదే నేనూ అనుకున్నాను. అంతగా తీరకపోతే తీరదనుకున్నాను".

సుబ్బారాయుడు మరికొంతసేపూరుకుని అడిగేడు.

"పిల్ల పెళ్ళి ఎలా చేస్తామనుకున్నావ్?"

"అది బతికి బట్టకడితే ఆ యింటిమీదే తేవాలి" అని.

"ఇంతకూ అది ఐదేళ్ళ తరవాత మాట" అన్నాడు పావనరామయ్య.

చాలా దూరం ఆలోచించి 'అవును మరి' అనుకున్నాడు సుబ్బారాయుడు.

వాళ్ళు జంక్షనుకి చేరుకొని కానాగట్టుమీద కూర్చున్నారు. కూర్చున్నాక కూడా చాలా సేపటి వరకూ మౌనంగానే ఉండిపోయేరు. ఆ తరవాత పావనరామయ్యే ఆరంభించేడు.

"అబ్బీ, ఒక విషయం నీతో చెప్పాలి. బావ ఏమిటి ఇలా మాటాడుతున్నాడనుకోకు. నాకు మనసులో మాటలు సరిగా చెప్పడం రాదు. నువ్వు ప్రయత్నం చేస్తే సరిగా అర్థం చేసుకోవచ్చు" అని సరిగా సర్దుకు కూర్చొని చెప్పడం ఆరంభించేడు.

"నేను మొదట్లో – అంటే చిన్నప్పుడు – దేని గురించీ ఏమీ ఆలోచించే వాణ్ణి కాను. ఏదో తింటున్నాం అంటే తింటున్నాం, ఉంటున్నాం అంటే ఉంటున్నాం – అన్నట్టుండే వాణ్ణి. తరవాత నలుగుర్నీ చూసి ఓహో బ్రతుకంటే ఇదా అనుకున్నాను".

పాప పుణ్యాలూ పరలోకం గురించి అందరూ మాటాడుతారు. కాని అందరూ ఇహం కోసమే బతుకుతారు.

ఈ లోకంలో సాహసించి ఎవడు ఎంత తన బోరకిందకి లాక్కుంటే అంతే వాడికి దక్కుడు. నావంతు నాకు న్యాయంగా వస్తుందన్నది భ్రమ.

–అని కొంతకాలానికి తెలుసుకున్నాను.

కాని నా తెలివి నాకేమీ ఉపయోగపడలేదు. లాక్కోవడమెలాగో తెలుసుకాని లాక్కోడానికి నా చేతులూ, కాళ్ళూ పాపపుణ్యాల పేరా న్యాయాన్యాయాల పేరా కట్టేసి వున్నాయి. నా గుండె అంతా పిరికిమందుతో బలహీనమైపోయి ఉంది.

అందుచేత ఉన్నంతలో వెసులుబాటు చేసుకుంటూ ఎవ్వరూ చూడనప్పుడు ఏ కొంచెం దొరికితే ఆ కొంచెమే సంగ్రహిస్తూ యేదో విధంగా బతుక్కుంటూ వచ్చేను.

ఆ రోజుల్లోని నా గురించి నేను జ్ఞాపకం తెచ్చుకుంటే ఇలా అనిపిస్తుంది.

నాకా ఉద్యోగం తప్ప చేతనయ్యింది యింకేమీ లేదు. ప్రాణం పోయినా ఫరవాలేదు; ఉద్యోగం ఊడు తుందంటే మాత్రం చెప్పరాని హడలు. దారిద్ర్యాన్ని భరించడానికి నేను సిద్ధం. గౌరవం దెబ్బతింటుందంటే భయం.

అందుచేతే గతీ మతీలేని ఆ బ్రతుకు అలా సాగించడం తప్ప నాకు మరో మార్గం లేకపోయింది. భారతదేశంలో నూటికి తొంభై మంది ఉద్యోగాలు చెయ్యకుండానే బ్రతకగలుగుతున్నారనే విషయం ఒక్కనాడు తట్టలేదు. కనీసం తులం బంగారంగాని, సెంటు భూమిగాని, చేరెడు ఇల్లుగాని ఉంటే నేనానాడు మరీ అంత పిరికి బ్రతుకు బ్రతికి ఉండనక్కరలేదని ఆరోజుల్లో నేను తరుచు అనుకునే వాణ్ణి.

నా బ్రతుకు తాలూకా బండారం మా పెద్దవాడు పోయేక మరీ స్పష్టమయ్యింది. వాడు పోయేక నేనెన్నో రోజులు అదేపనిగా ఆలోచిస్తుండే వాణ్ణి.

వాడు నా కడుపున పుట్టి ఎన్నడూ ఏ సుఖమూ అనుభవించలేదు. తిట్లూ, చీవాట్లూ, కసర్లూ, దెబ్బలూ తప్ప ఒక అచ్చటా ముచ్చటా యెన్నడూ ఎరగడు.

నా పేదతనం కొంతవరకూ కారణం. కాని అది ఒక్కటే కాదు. నా ముసలితనానికి నేను వాడిపై ఆధారపడి ఉన్నాను. అందుకే వాడి లేత బ్రతుకు మీద మోయలేని భారాన్ని మోపి వాడి నూరేళ్ళ బ్రతుకూ బండలు చేసేను.

నేను ఎప్పుడేది చేసినా వాడి మేలునుకోరి ఏదీ చేయలేదు. వాడికి చెప్పే నీతులు వాడి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కాక నా భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని చెప్పేను. వాడికి చెప్పించిన చదువంతా నా కోసమే చెప్పించుకున్నాను. బ్రతికి ఉంటే వాడికి పెండ్లి నా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని చేసేవాణ్ణి. వాడు పిల్లలను కంటే దానివల్ల కలిగే ఆనందం, ఆనందలేమీ, నా శ్రేయస్సునుబట్టి తేలి ఉండేవి.

కనుక్కున్న పిల్లలకూ, కన్న తల్లిదండ్రులకూ కల సంబంధం యీ పాటిదిగా కనిపించిన నాడు నా గుండె బేజారై పోయింది".

పావనరామయ్య ఆగిపోయేడు. సుబ్బారాయుడికి అతని గుండె చిచ్చు అర్థమై గుండెలు నీరయ్యాయి. పావనరామయ్య మరికొంతసేపు ఊరుకొని ఆరంభించేడు.

"నేననుకుంటాను. నాకు జీవితంలో ఆదినుండీ భరోసా అన్నది లేదు. అందుచేత నేనన్ని బాధలుపడి నా సంసారాన్ని బాధలు పెట్టి దానికోసం మళ్ళా నేను బాధలు పడుతూ వచ్చేను. మనిషిలో సాహసానికైతేనేమి, బ్రతుకులో ఆనందానికైతేనేమి మూలం భరోసా – అది లేనినాడు మనిషి జీవచ్ఛవంగా తప్ప మనిషిగా బతకలేడు.

పావనరామయ్య మళ్ళా ఆగిపోయేడు. సుబ్బారాయుడు అతని మాటల వెనక అతడు ఈ అరవయ్యేళ్ళ యీ బ్రతికిన బ్రతుకుని అర్థం చేసుకుంటున్నాడు.

కురుస్తున్న పొగమంచు అంతకంతకు దట్టమౌతున్నది. కాస్తున్న వెన్నెలలు క్రమ క్రమంగా కాంతి తగ్గుతున్నాయి. దూరాన్న హెడ్‌లైట్‌లు ఎటో ఎటో కదులుతున్నాయి. పావనరామయ్య మళ్ళా ప్రారంభించాడు.

"చెప్పవచ్చేదేమంటే నేనీ యిల్లు కొనడమా, మానడమా అన్న ఆలోచనలో ఉన్నప్పుడు ఒక నిశ్చయానికి రావడం చాలా కష్టమయ్యింది. ఆ డబ్బుపెట్టి పిల్ల పెళ్ళి చెయ్యాలనుకున్నప్పుడల్లా నా గుండెలు దడదడలాడేవి. కాళ్ళ క్రింద భూమి అందకుండా పాతాళానికి జారిపోతున్నట్టనిపించేది. చివరికి ఇలా అనుకున్నాను. ఈ యిల్లు కొనడమొక్కటే నేను నా జీవితంలో ఆడగల జూదం – ఇల్లు కొంటే నేను నా ముసలితనాన్ని ధైర్యంగా ఎదుర్కోగలుగుతాను. అదృష్టం బాగుండి ఇల్లు దక్కించుకోగలిగితే నాకన్న నాపిల్లలు గొప్ప అదృష్టవంతులు కాగలరు. దక్కించుకోలేక పోవడానికి చాలా కాలం పడుతుంది. ఈ లోగా దేవుడు హాని చేయకపోతే నేను కన్ను మూసేయకపోను".

–పాపం! అనుకోలేదు సుబ్బారాయుడు. ఏమనుకోడానికీ అతనికి టైములేదు. అతన్ని బస్సెక్కించి అది వెళ్ళేక పావనరామయ్య యింటి ముఖం పట్టేడు.

పావనరామయ్యకు ఎంత కాదనుకున్నా అరవైయేళ్ళుంటాయి. వెన్నెల ఉన్నప్పటికీ దారి మరీ కొత్తది. అందుచేత అతడా రోడ్డున చీకట్లో నడుస్తున్నట్టు నడుస్తున్నాడు.

పావనరామయ్య కొత్తగా కొనుక్కున్న యింటికి దీపాలు లేవు. అవి వేయించేసరికి ఎన్నాళ్ళు పడుతుందో తెలియదు. డబ్బుకెక్కడ వెదకడమన్న ప్రశ్న ఎదురైనప్పుడల్లా దాన్ని జోరీగను తోలినట్టు తోల్తుంటాడు. మనిషి వీధి చివర చీకట్లో చీకటిగా ఉన్న ఇంటికేసి నడుస్తున్నాడు.

ఆ కాలనీలో క్రొత్తగా లేచిన భవనాల్లో చాలా వాటికి నిర్మాణం పూర్తికాక ముందే దీపాలు పడ్డవి. కానీ వెచ్చదనం కోసం వాటి తలుపులన్నీ మూసి ఉన్నవి. ఇళ్ళలో బంధించిన వెలుతురుతో, వీధుల్లో విహరించే చీకటితో ఊరికి ఉత్తరాన వెలుస్తున్న ఆ కొత్తవాడ కలకల్లాడుతూ కనిపించే కన్నెపిల్లలా కాకండా అకాల వైధవ్యం దాపురించిన కాంతలా ఉన్నది.

★

*(జ్యోతి సచిత్ర మాసపత్రిక, ఏప్రిల్, 1964)*